క్లుప్తంగా

కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు



సత్తెనపల్లి: పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో గల కోదండ రామాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలను శోభాయమానంగా అంకరించి పూజలు చేశారు. పవళింపు సేవ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు, మహిళలు భక్తులు, పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా నిర్వాహకుడు ఆత్మకూరు వెంకట హరే రామ చెంచయ్య ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలోని శ్రీషిర్డీసాయిబాబా ఆలయ 11వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా తెల్లవారు జాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అభిషేకాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని సాయిబాబాని దర్శించుకొని పూజలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.ఈ సందర్భంగా భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నకరికల్లులోని ఇంట్లో చోరీ



నకరికల్లు: ఇంట్లో ఎవరూలేరని గుర్తించిన గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన స్థానిక మెయిన్‌రోడ్‌లో జరిగింది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మార్రెళ్ల వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులతో సహా విజయవాడలోని తన కుమార్తె ఇంటికి ఈనెల 20వతేదీన వెళ్లారు. తిరిగి శుక్రవారం ఇంటికి వచ్చేసరికి ఇంటి ప్రధానగేటు తెరచి ఉండడం చూసి ఆందోళనకు గురై ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తెరచి ఉంచి వస్తువులన్నీ చెల్లాచెదరుగా పడవేసి ఉన్నాయి. బాధితుడు పోలీసులను ఆశ్రయించగా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ పి.సురేష్ క్లూస్‌టీంను రంగంలోకి దింపి ఆధారాలు సేకరించారు. ప్రధానద్వారం గడియ తొలగించిన గుర్తుతెలియని దుండగులు ఇంట్లోకి ప్రవేశించి మంచం పరుపుకింద దాచిన బీరువా తాళం తీశారు. బీరువా తెరచి అందులోని అరకిలో వెండి వస్తువులు, 6కాసుల బంగారం, రూ. 10వేల నగదు చోరీ చేసినట్లు గుర్తించారు. ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దరఖాస్తుకు 30 వరకు గడువు

నకరికల్లు: రైతులకు రాష్ట్రప్రభుత్వం అందజేస్తున్న వైఎస్సార్ రైతుభరోసా పథకం లబ్ధిపొందేందుకు ఈనెల 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని మండల వ్యవసాయాధికారి కె. దేవదాసు శుక్రవారం తెలిపారు. కొత్తగా భూమి కొనుగోలు చేసిన రైతులు, ఇప్పటివరకు వైఎస్సార్ రైతుభరోసా పథకానికి దరఖాస్తు చేసుకోని రైతులు వైఎస్సార్ రైతుభరోసా 2023-24 పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకుపాస్‌పుస్తకం జిరాక్స్ రైతుభరోసా కేంద్రంలో అందజేసి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కొత్తగా అటవీశాఖ భూములకు (ఆర్‌ఓఎఫ్‌ఆర్) పాస్‌పుస్తకాలు పొందిన రైతులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

మంచినీటి సరఫరాకు అంతరాయం

సత్తెనపల్లి: పురపాలక సంఘ హెడ్ వాటర్ వర్క్‌లో పాత వాల్వ్ స్థానంలో కొత్త మెయిన్ 600 ఎం.ఎం.డయా వాల్వ్ ఏర్పాటు చేయుచున్నందున ఈనెల 30, మే ఒకటో తేదీ రెండు రోజుల పాటు పట్టణంలోని అన్ని వార్డుల్లో రక్షిత మంచినీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి శుక్రవారం తెలిపారు. పట్టణ ప్రజలు ముందస్తుగా తగు నీటి నిల్వలు ఏర్పాటు చేసుకుని పురపాలక సంఘానికి సహకరించాలని కోరారు.

నేటి నుంచి క్రికెట్ టోర్నమెంట్

అచ్చంపేట: మండలంలోని తాళ్లచెరువులో శనివారం నుంచి (టిపిఎల్)తాళ్లచెరువు ప్రిమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ కిక్కురు అర్లారెడ్డి, ఎంపీటీసీ గోపు అంతోనిరెడ్డిలు తెలిపారు. పెదకూరపాడు నియోజకవర్గ స్థాయిలో జరిగే ఈ పోటీల్లో మొత్తం 10 జట్లు పాల్గొంటాయన్నారు. పోటీలను శనివారం ఉదయం 8 గంటలకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ప్రారంభిస్తారని చెప్పారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు

మంత్రి అంబటి రాంబాబు

రాజుపాలెం: మండల పరిధిలోని పెదనెమలిపురి గ్రామంలో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగింది. కార్యక్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పాల్గొని ఇంటింటికి తిరిగి ప్రభుత్వం ముద్రించిన కర పత్రాలను అందించి, ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ప్రభుత్వ సేవలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. వలంటీర్ల పనితీరు ఎలా ఉంది, అంటూ వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. గృహాల్లో ఉన్న వృద్ధులను, వికలాంగులను పరామర్శించివారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పారదర్శకంగా అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రభుత్వ సంస్కరణలతో కూడిన పాలన ప్రజలు గుర్తించుకుని గత ప్రభుత్వానికి వ్యత్యాసాన్ని గమనించమని మంత్రి కోరారు. మండల స్థాయి ప్రజా ప్రతినిధులు నాయకులు ,అధికారులు సంయుక్తంగా గ్రామాల్లో సందర్శించి సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించుకునేందుకు కృషి చేస్తున్నారు. ప్రతి గ్రామానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరు చేసిన రూ.20 లక్షలతో శాశ్వత



పెదనెమలిపురిలో మహిళకు కర పత్రాలను అందజేస్తున్న మంత్రి అంబటి రాంబాబు

వనరుల సమ కల్పన సమస్యల పరిష్కారం అభివృద్ధి పనులకు వినియోగిస్తామని ఆయన వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ వేపూరి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ బాసు లింగారెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ మర్రి సుబ్బారెడ్డి, ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరిచంద్రమౌళి, జెడ్పీటీసీ దొంతిరెడ్డి సునీతశ్రీనివాసరెడ్డి, సర్పంచ్ కొర్రకూటి వెంకాయమ్మ, ఎంపీటీసీ కందులూరి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు అచ్యుత శివప్రసాద్, నల్లగొర్ల సీతారామయ్య, బంకా పాపారావు, తాటికొండ అంకమ్మరాజు, వేదాద్రి, కొర్రకూటి వెంకటేశ్వర్లు, గుత్తా శ్రీనివాసరావు, గుత్తా జిన్నియ్య, ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు, తహసీల్దారు నళిని, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక గురించి మాట్లాడే అర్హత కొమ్మాలపాటికి లేదు

క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి

అమరావతి: ఉచిత ఇసుకపేరుతో అక్రమ ఇసుక త్రవ్వకాలు చేసి యథేచ్ఛగా దోచుకున్న 23 మంది చావుకు కారణమైన మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అక్రమ ఇసుకపై మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించి నట్లుందని క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి అన్నారు. శుక్రవారం అమరావతిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో టీడీపీ ఇసుకదందా వల్ల 23 మంది మరణించారన్న విషయాన్ని, టీడీపీ హయాంలో ఇష్టారాజ్యంగా ఇసుక త్రవ్వకాలు జరిపితే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ రూ.100 కోట్ల రూపాయలు జరిమానా విధించిన విషయాన్ని మరిచిపోయి కొమ్మాలపాటి శ్రీధర్ ఇసుక గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యే శంకరరావు నిస్వార్ధంగా అభివృద్దే ధ్యేయంగా పాలన చేస్తూ అవసరమైతే తన సొంత నిధులతో ప్రజలకు సాయం అందిస్తున్న మంచి వ్యక్తిపైన నిత్యం అవాస్తవాలు మాట్లాడడం దారుణమన్నారు. ఈసందర్భంగా నర్సారావుపేట పార్లమెంట్ నియోజకవర్గ అధికారప్రతినిధి నండూరు కరుణకుమార్ మాట్లాడుతూ అమరావతిలో పర్యటనలో చంద్రబాబునాయుడు మాట్లాడుతూ నాపర్యటనకు అటంకం కలిగించడానికి ఫ్లెక్సీలు చించారని, తొలగించారని విమర్శలు చేయడం దారుణమన్నారు. టీడీపీలో రెండు వర్గాల వారు కొట్టుకుని ఫ్లెక్సీలు చించుకుంటే వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులపై ఆరోపణలు చేయడం ఆయన రాజకీయదిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. అలాగే ఎమ్మెల్యే శంకరరావు 13160 మందికి ఇళ్లపట్టాలు ఇచ్చి ఇళ్లుకట్టుకోవడానికి రుణాలు ఇప్పించారన్నారు. ఇసుక విషయంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అవలంబించిన ఇసుక విధానం వల్ల ఏడాదికి రూ.720 కోట్ల రూపాయలు ఖజానాకు జమచేస్తున్నారని మీలాగా ఉచిత ఇసుక పేరుతో జేబులు నింపుకోలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బిసిల అభివృద్ధికి ఎమ్మెల్యే శంకరరావు నిరంతరం కృషిచేస్తున్నారన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి మంగిశెట్టి కోటేశ్వరరావు మాట్లాడుతూ ఎంతో రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు బహిరంగసభలో నిస్సిగ్గుగా అబద్దాలు మాట్లాడడం, ఎమ్మెల్యే శంకరరావుపైన వ్యక్తిగత విమర్శలు చేయడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. సమావేశంలో మండల సచివాలయ కన్వీనర్ భవిరిశెట్టి హనుమంతరావు, ఎంద్రాయి గ్రామ సర్పంచ్ నాయుడు రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆళ్ళ శ్రీనివాసరెడ్డి అలా లక్ష్మీనారాయణ,రోశిబాబు, పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

సత్తెనపల్లి: మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం ఈ నెల 29న సాయంత్రం 4.00 గంటలకు మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి అధ్యక్షతన జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి శుక్రవారం తెలిపారు. ఈ సమావేశానికి ఎక్స్‌అఫిషియోగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాజరవుతారన్నారు. అజెండా లోని అన్ని అంశాలపై చర్చించి ఆమోదించడం జరుగుతుందన్నారు. కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

వివాహిత ఆత్మహత్య

ముప్పాళ్ళ: మండలంలోని తొండపి గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన వివాహిత ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం జరిగింది. వివాహం జరిగి ఏడాది మాత్రమేనని స్థానికులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. మృతి పై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ముప్పాళ్ళ పోలీసులు తెలిపారు.

లైంగిక వేధింపులపై కేసు నమోదు

ముప్పాళ్ళ: వివాహిత పట్ల మరిది అసభ్యంగా ప్రవర్తిస్తూ లైంగికంగా వేధింపులకు గురి చేస్తున్నాడంటూ ఇచ్చిన ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎమ్.పట్టాభిరామయ్య శుక్రవారం తెలిపారు. మండలంలోని చాగంటివారి పాలెం కు చెందిన చల్లారేణుక భర్త నాలుగేళ్ళ క్రితం మృతి చెందడంతో తన ఇద్దరి పిల్లలతో జీవనం సాగిస్తుంది. అయితే రేణుక మరిది అయినటువంటి చల్లాప్రసాదు గత కొంతకాలంగా లైంగికంగా వేదింపులకు గురిచేస్తుండడంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. రేణుక ఫిర్యాదు మేర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వావిలాల వర్ధంతిని విజయవంతం చేయాలి

మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: స్వాతంత్ర్య సమరయోధుడు, పద్మ భూషణ్, సత్తెనపల్లి మాజీ శాసనసభ్యుడు వావిలాల గోపాల కృష్ణయ్య 20వ వర్ధంతి సభ పట్టణంలోని వావిలాల స్మృతి వనంలో ఈ నెల 29న ఉదయం 9 గంటలకు జరుగు తుందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి నరసరావుపేట పార్లమెంటు సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, పల్నాడు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయలు రాజనారాయణ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి, విజయనగరం సామా జికవేత్త పారినాయుడు, వావిలాల సంస్థ కార్యదర్శి మన్నవ సోడేకర్ హాజరవుతారన్నారు. ప్రజా ప్రతినిధులు, నాయకులు, వావిలాల అభిమానులు, హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ప్రారంభమైన జిల్లా స్థాయి తాళం భజన పోటీలు

సత్తెనపల్లి: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి 84వ ఆరాధనోత్సవాల్లో భాగంగా పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని శ్రీ సనారీ వీర బ్రహ్మేంద్ర ఆశ్రమంలో శుక్రవారం జిల్లా స్థాయి తాళం భజన పోటీలను ఆశ్రమ మాతాదిపతులు లలితాంబ మాతాజీ ప్రారంభించారు. ఆశ్రమ వ్యవస్థాపక ధర్మకర్త స్వప్రకాష్ గురూజీ ఆరాధన సందర్భంగా ప్రత్యేక పూజలు, అన్న సంతర్పణ నిర్వహించారు. తొలి రోజు పోటీల్లో తొమ్మిది సమాజాలు పాల్గొన్నాయి. పోటీల్లో పాల్గొన్న సమాజములకు పారి తోషికం, జ్ఞాపికలను ఆశ్రమ నిర్వాహకులు చింతాడ గిరినాథ్ శర్మ, సూర్యప్రకాష్, కమలాదేవి, ఉమాదేవి, డాక్టర్ ప్రవల్లిక, డాక్టర్ ప్రత్యూష, తదితరులు అందించారు. శనివారం



జ్ఞాపికలు అందజేస్తున్న ఆశ్రమ నిర్వాహకులు

కూడా పోటీలు జరుగుతాయన్నారు. ఈ నెల 30న బ్రహ్మంగారి ఆరాధన, అన్నసంతర్పణ ఉంటాయని, భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని వారు కోరారు.

బీజేపీకి దేశాన్ని పాలించే అర్హత లేదు

సీపీఎం పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యుడు రవిబాబు

అమరావతి: నిరుద్యోగ సమస్య, ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ పరం చేయడం, పెట్రోలు, డీజిల్, గ్యాస్, నిత్యావసరవస్తువుల ధరలు విపరీతంగా పెంచిన భారతీయజనతా పార్టీకి పాలించే అర్హత లేదని సీపీఎం పల్నాడు జిల్లా కార్యవర్గ సభ్యుడు జి రవిబాబు అన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ బొమ్మ సెంటర్‌లో సీపీఎం 30 రోజు ప్రచారభేరి కార్యక్రమంలో భాగంగా నిరసన నిర్వహించారు. ఈసందర్భంగా రవిబాబు మాట్లాడుతూ బీజేపీ కార్మిక, కర్షక, ఉద్యోగ, విద్యార్థుల ప్రయోజనాలను కాలరాస్తూ, ప్రతిపక్షపార్టీల గొంతు నొక్కి కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడి దేశాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైన ఉందన్నారు. తొలుత స్థానిక




స్థానిక అంబేడ్కర్ బొమ్మ సెంటర్లో నిరసన తెలియచేస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

అంబేడ్కర్ బొమ్మ సెంటర్లో నిరసన తెలిపి బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరసన కార్యక్రమంలో ఎస్‌కె మొహిద్దీన్‌వలి, సుబ్రమణ్యం, కరిముల్లా, వెంకటేశ్వరరాజు, తమ్మిశెట్టి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

సత్తెనపల్లి: వివిధ రుగ్మతలతో బాధపడుతూ ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడం ప్రాణ దానంతో సమానమని ఏరియా వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ ఈటిపోగు వెంకట్రావు అన్నారు. పట్టణంలోని ఏరియా వైద్యశాలలో వైద్యశాల అభివృద్ధి కమిటీ, పోలిశెట్టి ఆంజనేయులు(లేటు) ఫ్రెండ్స్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకట్రావు మాట్లాడుతూ ఎండాకాలంలో రక్తదానం చేయడం ఎంతో అవసరమని, ముఖ్యంగా గర్భిణులకు ఈ రక్త దానం ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. రక్తదానం చేసేందుకు ముందు కొచ్చిన ఆంజనేయులు మిత్రులను కొనియాడారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్త రామకృష్ణ మాట్లాడుతూ అంజ నేయులు ఎప్పటి నుంచో అందరితో కలిసి మెలిసి ఉండేవాడని, అందరితో మంచి తనంగా ఉండేవాడన్నారు. ఆయన ఫ్రెండ్స్ సర్కిల్ ఒక పం



రక్తదానం చేస్తున్న యువకులు

డగ వాతావరణంలో వచ్చి రక్తదానం చేస్తున్నారని కొనియాడారు. మొత్తం 95 మంది యువకులు స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం అందించారు. అదే విధంగా ప్రతి సంవత్సరం ఆంజనేయులు గుర్తుగా ఏదో సేవా కార్యక్రమంలో ముందు ఉంటా మని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మణ్ రావు, హెడ్ నర్స్ రమణమ్మ, డ్యూటీ డాక్టర్స్, మాబు మిత్ర బృందం పాల్గొన్నారు.

మోడీ పాలన దేశానికి అరిష్టం

సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి, మాజీ ఎంపీ మధు

సత్తెనపల్లి: నరేంద్రమోడి పరిపాలన భారతదేశానికి పెద్ద అరిష్టమని సీపీఎం రాష్ట్ర మాజీ కార్యదర్శి, మాజీ ఎంపీ పీ.మధు అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో శుక్రవారం రాత్రి నిర్వహించిన బహిరంగసభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సభకు సీపీఎం మహిళా నాయకురాలు ధరణి కోటవిమల అధ్యక్షత వహించారు. మధు మాట్లాడుతూ నరేంద్రమోడిని బలపర్చటమంటే నాగు పాముకు పాలుపోసి సాకినట్టేనన్నారు. బీజేపీని బలపరిస్తే రాష్ట్రానికి అన్యాయం చేసినట్లేనన్నారు. ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు తనకు జ్ఞానోదయం జరిగిందంటూ మోడి పాలనను మెచ్చుకుంటున్నాడని, మట్టికొట్టుకుపోతాడన్నారు. మొన్న మూడు సీట్లు గెలవటంతో చంద్రబాబుకు ఒంటిపై బట్టలు నిలవడం లేదని, కానీ ఆపార్టీ నాయకులు, కార్యకర్తలలో హుషారు లేదన్నారు. రేపు తాము అధికారంలోకి వద్దామనో, సీట్లు వచ్చినా రాకపోయినా 1920 లో చిన్న శక్తిగా ఉన్నా దేశా



బహిరంగసభలో మాట్లాడుతున్న మధు

నికి సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం పోరాడామన్నారు. ప్రతి ఊరులో ప్రతి గుడిలో ఆర్ఎస్ఎస్, విశ్వహిందూపరిషత్, హిందూ-ముస్లింలకు క్రైస్తవలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టే కార్యక్రమాన్ని చేస్తున్నారని విమర్శించారు. మోడి వచ్చి ఏపీ రాజధానికి చెంబునీళ్ళు, గుప్పెటు మట్టి ఇచ్చి ప్రారంభించారన్నారు. సభలో సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి ముప్పాళ్ళనాగేశ్వరరావు, పల్నాడు జిల్లా అధ్యక్షుడు మారుతివరప్రసాదు లు మాట్లాడారు. సభలో సీపీఐ నాయకులు నరిశేటివేణు గోపాల్, యిర్మియా, సీపీఎం నాయకులు గద్దెచలమయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తురక గంగమ్మవి నిరాధారమైన ఆరోపణలు

సత్తెనపల్లి వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు

సత్తెనపల్లి: టీడీపీ, జనసేన పార్టీల నాయకులు... అసత్య ఆరోపణ చేస్తున్న తురక గంగమ్మకు సాయం చేసినట్లుగానే వాస్తవం వైపు నిలబడి సత్యం గా ఉన్న పల్లపు రోశయ్య కుటుంబానికి కూడా సాయం చేయాలని, తురక గంగమ్మ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు పై చేస్తున్న నిరాధారమైన ఆరోపణలను పూర్తిస్థాయిలో ఖండిస్తున్నామని నియోజవర్గ వడ్డెర సంఘం నాయకులు అన్నారు శుక్రవారం రాత్రి నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంఘటన పూర్వాపరాలను వారు వివరించారు.. 20 ఆగస్టు 2022వ సంవత్సరంలో పట్టణంలోని ఆర్య వైశ్య సామాజిక వర్గానికి చెందిన కందకట్ల కొండల హోటల్లో డ్రైనేజీ మరమ్మత్తుల నిమిత్తం వడ్డెర కులానికి చెందిన తురక అనిల్ కుమార్, పల్లపు బ్రహ్మయ్యలు ప్రమాదవశాత్తు సంపులో పడి శ్వాస ఆడక చనిపోయారు . వారిని కాపాడేందుకు వెళ్లి హోటల్ యజమాని కందకట్ల కొండలు కూడా ఈ దుర్ఘటనలో బలవ్వడం జరిగింది. ఆ సమయంలో చనిపోయిన వడ్డెర కులానికి చెందిన పిల్లల తల్లిదండ్రులు, పెద్దల అభ్యర్థన మేరకు కొండలు కుటుంబ సభ్యులు మతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 2.50 లక్షల చొప్పున మట్టి ఖర్చులకు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంలో పెద్దల సమక్షంలో బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరైన తర్వాత వచ్చిన నగదులో నుంచి ముందుగా తీసుకున్న రూ.2.50 లక్షల తిరిగి కొండల కుటుంబానికి ఇచ్చే విధంగా ఒప్పందం జరిగింది. అనంతరం అనిల్ కుమార్ కు మాత్రమే ముఖ్యమంత్రి సహాయనిధి మంజూరైనది. అతనికి మంజూరైన రూ.5 లక్షల్లో ముందు ఒప్పందం ప్రకారం రూ.2.5 లక్షల ఇవ్వాల్సి ఉండగా అనిల్ తల్లి గంగమ్మ నిరాకరించారు. మంత్రి అంబటి రాంబాబు ఒప్పందం ప్రకారం చేయండి అని చెప్పగా ఆ మాటను తిరస్కరించి మంత్రి రాంబాబు పై అసత్య ఆరోపణలు చేయడం మొదలు పెట్టింది. రాజకీయ నేపథ్యంలోనే తెలుగుదేశం పార్టీ నాయకులు వడ్డెర గంగమ్మను అడ్డుపెట్టుకొని మంత్రి అంబటి రాంబాబు ని విమర్శించడం సరైనది కాదని వడ్డెర సంఘం నాయకులు వివరించారు. సమావేశంలో పట్టణ వడ్డెర నియోజకవర్గ సంఘాల అధ్యక్షుడు వేముల వరప్రసాద్, తన్నీరు శ్రీనివాసరావు ,న్యాయవాది చెంబేటి శివరామకష్ణ , చల్లా ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, కొమెర శివశంకర్, బత్తుల గోపి, పల్లపు లక్ష్మయ్య, పాలకొండ వెంకటరావు, ఓర్సు శ్రీనివాసరావు, దేవాండ్ల నాగయ్య ఉన్నారు.

స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నిరుపేదల ఇంట సంక్షేమ కాంతులు వెలుగుతున్నాయని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అచ్చంపేట సచివాలయం-2 పరిధిలోని నీలేశ్వరపాలెంలో శుక్రవారం రాత్రి ఆయన ఇంటింటికి తిరిగి గత నాలుగేళ్లుగా అమలవుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ కరపత్రాలను అందజేశారు. ఏ ఇంటికి ఎంత లబ్ధిచేకూరిందో విపులీకరించారు. ఎస్టీ, బీసీ కాలనీ వాసుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంచినీటి సమస్యకు శాశ్విత పరిష్కారంగా జల జీవన్ మిషల్ ద్వారా ఇంటింటికి మంచినీటి కుళాయిలు ఇవ్వనున్నట్లు చెప్పారు. అంతర్గత రహదారులు వేస్తున్నట్లు చెప్పారు. మంచి చేసినవారిని మనసారా ఆశీర్వదించండి, మళ్లీ జగన్ సీయం కావాలని కోరుకోండి, మరిన్ని సంక్షేమ పథకాలు వస్తాయని చెప్పారు. చంద్రబాబు కల్లబొల్లి కబుర్లు, అబద్దపు హామీలు నమ్మి మోసపోవద్దన్నారు. అర్హత ఉండి ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే వెంటనే తన దృష్టికి తేవాలన్నారు. ప్రతి నెలా 1వ తేదిన పెన్షన్లు అందుతున్నాయా అని ప్రశ్నించారు. వలంటీర్లుఅంతా మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారని, ఎమన్నా సమస్యలు ఉంటే వాళ్ల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. సచివాలయాలద్వారా మీకు మీ గ్రామంలోనే అన్ని పనులు అవుతాయని, ఎవ



సంక్షేమ లబ్ధిని వివరిస్తూ, ప్రభుత్వ కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

రూ పనులు మానుకుని మండలంచుట్టూ తిరగొద్దని చెప్పారు. ఆయన వెంట ఆయన వెంట జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా రజనీ కృష్ణానాయక్, సర్పంచ్ కోటేశ్వరరావునాయక్, వ్యవసాయ యూనివర్శిటి మాజీ డైరెక్టర్ నెల్లూరి చంద్రబాబు, సొసైటి మాజీ చైర్మన్ తుమ్మా చిన్నపరెడ్డి, ఎఎంసీ మాజీ డైరెక్టర్ అంబటి నారాయణ, జిల్లాపార్టీ కార్యదర్శి సుంకర శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ కోటేశ్వరరావునాయక్, వైస్ ఎంపీపీ గంగసాని బాబు, అచ్చంపేట సర్పంచ్ కంబాల వీరబాబు, ఎంపీటీసీ తెల్లమేకల నాగరాజు, సొసైటీ చైర్మన్ రామిశెట్టి రంగయ్య, మార్కెట్ యార్డు డైరెక్టర్ చిరుమామిళ్ల నరశింహారావు, సొసైటి మాజీ చైర్మన్ రామిశెట్టి చిన యల్లమందయ్య, బాలూనాయక్, వీరబాబు, నీలయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

బాలెమర్రు(క్రోసూరు): మండుటెండల్లో మిర్చి ఘాటును లెక్కచేయకుండా కూలీలు పొలంలో పనులు చేస్తుంటారు. వారి యోగక్షేమాలు తెలుసుకునేందుకు, మండలంలోని బాలమర్రు గ్రామం నుంచి క్రోసూరు వెళ్తూ మార్గమధ్యంలో పొలంలో మిర్చి కోతలు కోస్తున్న కూలీలను శుక్రవారం పరామర్శించారు. వారికి వస్తున్న కూలీ వేతనం వివరాలు తెలుసుకున్నారు. గంటకు రూ. 50 కోసం మండుటెండలో పనిచేస్తున్నట్లు తెలుసుకున్నారు. కన్నబిడ్డల కోసం, కన్నవారికోసం కష్టాన్ని భరించటం తప్పటం లేదని వారు తెలియచేశారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధిహామీ కూలీకి వెళ్లేందుకు మేట్‌లను సంప్రందించాలని రోజుకు దాని ద్వారా రూ.200 పైగా వస్తాయి కదా అని ఎమ్మెల్యే సూచించారు. ముఖ్యమంత్రి జగనన్న అందిస్తున్న ప్రభుత్వ పథకాలు అన్నీ అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. జగనన్న పథకాల వల్లే మూడు పూటలా తినగలుగుతున్నామని కూలీలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ పి.కోటయ్య, మేశంధామస్, ఎంపరాలనాగేశ్వరరావు, ఎన్.నాగేశ్వరరావు, తోకలశివ, కాటయ్య, జెట్టి వెంకయ్య,జెర్రిపోతు రవి , వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. వేళంగిణి మాతా దేవాలయం ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే మండలంలోని బాలెమర్రు గ్రామంలో శుక్రవారం వేళంగిణి మాతా దేవాలయం ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే నంబూరు శంకరరా వు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ ప్రభువు చల్లని దీవెనలు అందరికీ ఉండాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితునికి ఆర్థిక సాయం

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలో జరిగిన అగ్నిప్రమాదంలో ఇల్లు కోల్పోయిన చింతపల్లిపిచ్చయ్య కు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తనవంతుగా రూ.5వేల ఆర్థిక సాయంతో పాటుగా 25 కేజీల బియ్యం శుక్రవారం రెడ్‌క్రాస్ సభ్యుల చేతుల మీదుగా అందించారు. అలాగే మంత్రి అంబటి రాంబాబు చొరవతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేర పల్నాడు జిల్లా రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రూ.8వేల విలువ చేసే వంటపాత్రలు, దుస్తులు, పరదాపట్టాను గ్రామ ఉపసర్పంచ్ సైదా, తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్, రెడ్‌క్రాస్ ఛైర్మన్ డా.కె. జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు గుప్తా, ఆంజనేయులు, చంద్రశేఖర్ ఎంపీటీసీ గోగులఅంజి



బాధితునికి సాయం అందజేస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు కానాలపుల్లారెడ్డి, వెంకటరెడ్డి, చిమటాశ్రీనివాసరావు, గొర్రెపాటిమునియ్య, కొడవటిసుబ్బారావు, శ్రీనివాసరావు, మందపాటిపేరయ్య తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు లో

O.S No. 47/2020

1. కమ్మ లక్ష్మి,
2. కమ్మ అన్విత మైనర్

రిప్రజెంటెడ్ బై నెక్స్ ఫ్రెండ్ మదర్ కె. లక్ష్మి ...వాదులు

Vs

కమ్మ చౌదరి వగైరాలు .... ప్రతివాదులు

To: మూలం లలితమ్మ, W/o. శీతారామయ్య, గణపవరం గ్రామం, రాజుపాలెం మండలం, పల్నాడు జిల్లా. (7వ ప్రతివాది)

పై నెంబరుగల దావా వాదులు దావా పరిహారం నిమిత్తం మీమీద దాఖలుపరిచి, అందు IA No. 454/2020 నంబరున దావా తీర్మానం అగు వరకు ఎటువంటి పరాధీనంలు దావా ఆస్తి గురించి చేయకుండా వుండుగలందులకు మీపై టెంపరరీ ఇంజక్షన్ ఉత్తర్వులు కోరుచూ, అందు మిమ్ములను 7వ రెస్పాండెంటుగా చూపి కోర్టు ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు, నోటీసులు మీకు పంపిన మీకు చేరనందున శ్రీ కోర్టు వారు ఈ పేపరు పబ్లికేషన్ ద్వారా మీకు సమను, నోటీసులు జారీచేయమని ఆర్డరు వేసి తేదీ 10-5-2023 కి వాయిదా వేసివున్నారు. సదరు విషయమై మీకు ఎలాంటి ఆక్షేపణలు వున్నయెడల సదరు తేదీన ఉదయం 10-30 గంటలకు పైకోర్టు వారి యెదుట నీవు స్వయంగాగాని, లేదా అడ్వకేటు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలుసుకోవలసినది.

"కోర్టు వారి అనుమతితో"

బడుగు రూపేష్,
అడ్వకేట్, అద్దంకి, బాపట్ల జిల్లా,
Cell: 98481 67996.

స్థలం: అద్దంకి
తేది: 28-04-2023